ప్రజాసేవకు పదవి అనవసరం

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- నా విజయానికి దోహదపడిన వారికి కృతజ్ఞతలు : ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



ఎంపీటీసీలను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కొత్తకోట, జూలై 1 : ప్రజాసేవ చేసేందుకు పదవి అవసరం లేదని.. ఆపదని వచ్చిన వారికి అండగా నిలవాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పదవీ విరమణ పొందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ.. ఐదేండ్లు ప్రజలతో మమేకమై వారి సమస్యల్లో భాగస్వాములైన వారంతా ఇప్పుడు కూడా అదేవిధంగా ముందుకు సాగే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. అప్పుడే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతామన్నారు. అవకాశం వచ్చినప్పుడల్లా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు సొంత నిధులు వెచ్చించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తన గెలుపునకు కృషి చేసిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్సీ, ఆలకు ఎంపీపీ గుంత మౌనిక జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, చెన్నకేశవరెడ్డి, ప్రశాంత్, వడ్డె శ్రీనివాసులు, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి తండ్రీకూతురు మృతి

మహబూబ్‌నగర్, జూలై 1 : క్షణికావేశంలో రైలు కిందపడేందుకు వెళ్తున్న తండ్రిని కాపాడేందుకు వెళ్లి తండ్రితోపాటు కూతురు మృతిచెందిన ఘటన మహబూబ్‌నగర్‌లో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి మహబూబ్‌నగర్ రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్‌పాషా కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మందిపల్లికి చెందిన శివానంద్(46) భార్యతోపాటు కూతురు చందన(18), కుమారుడితో కలిసి పట్టణంలోని ఏనుగొండ సమీపంలోని చైతన్య స్కూల్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. సోమవారం సాయంత్రం శివానంద్ ఇంట్లో గొడవ పడి క్షణికావేశంతో చనిపోతానని పక్కనే ఉన్న రైలు పట్టాల వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో కూతురు చందన తండ్రిని కాపాడేందుకు వెళ్లగా, అప్పటికే పట్టాలపై వస్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో తండ్రీకూతురు ఇద్దరు మృతిచెందారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు. కాగా, మృతుడు ఎస్వీఎస్ దవాఖాన డైరెక్టర్ రాంరెడ్డి వ్యక్తిగత డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కూతురు ఎస్వీఎస్‌లో ఎంఎల్‌టీ చదువుతున్నది.

తూకాల్లో మోసాలు : కేసు నమోదు

జడ్చర్ల టౌన్, జూలై 1 : జడ్చర్ల మండలం చర్లపల్లి శివారులోని విజయ్‌కుమార్ గోదాం వేబ్రిడ్జ్‌లో సోమవారం లీగల్ మెట్రోలజీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. వేబ్రిడ్జ్ తూకాల్లో మోసాలు జరుగుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు లీగల్ మెట్రోలజీ అధికారులు తనిఖీ చేపట్టారు. ప్రతి వెయ్యి కిలోలకు 10కేజీల చొప్పున, 5వేల కిలోలకి 40కేజీలు వ్యత్యాసం వచ్చినట్లు అధికారులు గుర్తించారు. వేబ్రిడ్జ్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు జిల్లా లీగల్ మెట్రోలజీ ఇన్‌చార్జి అధికారి రామకృష్ణ తెలిపారు. తూకాల్లో తేడాలు కనిపిస్తే 9010651783 నెంబర్‌కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నా భూమిని కబ్జా నుంచి విడిపించరూ..

- అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని మనస్తాపం
- గద్వాల ప్రజావాణిలో రైతు ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న పోలీసులు, దవాఖానకు తరలింపు

గద్వాల, జూలై 1 : జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తుండగా ఓ రైతు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు అడ్డుకున్న సంఘటన చోటు చేసుకున్నది. బాధిత రైతు కథనం మేరకు వివరాలు ఇలా..

అయిజ మండలం యాపదిన్నె శివారులో గుడిదొడ్డి గ్రామానికి చెందిన వడ్డె సవారన్నకు సర్వే నెంబర్ 321లో ప్రభుత్వం 1986లో ఐదెకరాల భూమిని అందజేసింది. మరణానంతరం ఆ భూమిని అతడి కుమారులు వడ్డె పరశురాం, వడ్డె తిమ్మప్ప, వడ్డె కృష్ణ కుమారులు సాగు చేసుకుంటున్నారు. అయితే తండ్రి పేరుపై ఉన్న భూమిని కొడుకుల పేరుపై నాటి అధికారులు మార్చలేదు. ఈ క్రమంలో పొలం చుట్టుపక్కల ఉన్న భూములను ఆక్రమించుకున్న కొందరు మమ్మల్ని కూడా మా పొలంలోకి వస్తే చంపుతామని బెదిరించారని పరశురాముడు వాపోయాడు. ఈ విషయమై పలుమార్లు కలెక్టర్, తాసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేసినా న్యాయం చేయలేదని వాపోయారు. ఇప్పటి వరకు నలుగురు కలెక్టర్లు మారినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా భూమికి హద్దులు చూపించాలని చివరకు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నాడు. ఆరు వారాల్లోగా భూమిని సర్వే చేసి నివేదిక ఇవ్వాలని మండల సర్వేయర్‌ను ఆదేశించగా.. కొన్ని నెలల తర్వాత సర్వే చేసి మేము మోకమీద లేమని రిపోర్టు ఇవ్వడంతో తమ పేరుపై ఉన్న భూమిని ధరణి పోర్టల్‌లో వేరే వ్యక్తుల పేర్లపైకి మార్చారని వాపోయాడు. అధికారులు రికార్డులు తారుమారు చేసి మా గ్రామానికి చెందిన లోకేశ్వర్‌రెడ్డి, గోవిందమ్మ, సత్యారెడ్డి, శంకరన్న, ఎల్లారెడ్డి పేర్లమీద భూబదలాయింపు చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదేమని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారని, దీంతో చేసేది లేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించినట్లు సదరు రైతు చెప్పుకొచ్చాడు. ఈ క్రమంలో పురుగుల మందు తాగేందుకు యత్నించిన రైతును పోలీసులు అడ్డుకొని జిల్లా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

రైతు పరశురాముడిని అడ్డుకొంటున్న పోలీసులు

పెట్రోల్ బాటిల్‌తో మహిళా రైతు హల్‌చల్

- తన భూమిని ఇతరుల పేరు మీదికి మార్చారంటూ ఆవేదన

లింగాల, జూలై 1 : తన భూమిని ఇతరుల పేరు మీద చేశారని.. తనకు న్యాయం చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన గాలేటి జయమ్మ సోమవారం పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్ చేసింది. స్థానిక తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. బాధితురాలి కథనం మేరకు.. లింగాల శివారులోని 770 సర్వేనెంబరులో తన పేరు మీద ఉన్న 1-37 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు ఇతరుల పేరున పట్టా చేశారని వాపోయారు. తన పేరిట మార్చాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా తనకు న్యాయం చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకుంటే తన కుటుంబానికైనా న్యాయం జరుగుతుందని పెట్రోల్ బాటిల్‌తో కార్యాలయానికి వచ్చింది. కార్యాలయంలో ఉన్న డీటీ పట్టాబి మహిళా రైతు వద్దకు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. ఆ సమయంలో పక్కనే ఉన్న కొందరు ఆమె చేతిలోని పెట్రోల్ బాటిల్‌ను లాగేసుకున్నారు. రికార్డులను పరిశీలించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని డీటీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించింది.

లింగాల తాసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిల్‌తో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న మహిళా రైతు

బొటానికల్ గార్డెన్ అద్భుతం

- డీటీసీ ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి

జడ్చర్ల టౌన్, జూలై 1 : జడ్చర్లలోని డాక్టర్ బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారని హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీసు శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి అన్నారు. సోమవారం స్థానిక తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను ఆయన సందర్శించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య ఆయనకు మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన గార్డెన్‌లోని వివిధ విభాగాలను సందర్శించి అరుదైన రకాల మొక్కలను పరిశీలించారు. గార్డెన్‌లో పెంచుతున్న ఔషధ మొక్కల వివరాలను సదాశివయ్యను అడిగి తెలుసుకున్నారు. అంబర్‌పేట పోలీసు శిక్షణ కేంద్రంలోనూ గార్డెన్ పెంచడానికి సదాశివయ్య సహకారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సీతా అశోక, విషముష్టి, బుడదర్మి మొక్కలను సందర్శనకు వచ్చిన ఎస్పీకి అందజేశారు. అలాగే బయో డైవర్సిటీ రీసెర్చ్ సెంటర్‌లో నిల్వ చేసిన అతిపెద్ద జర్రిపోతు పాము కుబుసంను పరిశీలించారు. పాముల సంరక్షణను గురించి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ బొటానికల్‌గార్డెన్ అద్భుతంగా ఉందని, ఈ గార్డెన్‌లో పరిశోధనలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ హైదరాబాద్ రీజినల్ చైర్మన్ రఘునాథరెడ్డి, వలంటీర్లు రాహుల్, నవనీత్, ఇందు, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను పరిశీలిస్తున్న అంబర్‌పేట పోలీసుశిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి

నూతన చట్టాలతో సత్వర న్యాయం

నారాయణపేట, జూలై 1 : నూతన చట్టాలతో ప్రజలకు సత్వరన్యాయంతోపాటు శిక్షలు వేయడానికి అవకాశం ఉంటుందని సీఐ శివశంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సీఆర్‌పీసీ స్థానంలో భారతీయ నాగరిక సురక్ష సంహిత, ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్షాయ అధినియం 2023 అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ఈ నూతన చట్టాల ద్వారా ఎక్కడినుంచైనా ఆన్‌లైన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసుకోవచ్చని, నమోదుకు ఫిర్యాదుదారుడి డిజిటల్ సంతకం తప్పకుండా ఉండాలన్నారు. లేదంటే మూడు రోజుల్లో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకం చేసి వెళ్లాలన్నారు. ఆడియో, వీడియో సాక్ష్యాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగిన నేరాలకు ఉచితంగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసే అవకాశం ఉంటుందని, రెండు నెలల్లోపు దర్యాప్తు చేయాల్సి ఉంటుందన్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆయిల్‌పాం గెలల సేకరణ

వనపర్తి, జూలై 1: జిల్లాలో 2020-21, 22-23 ఏడాదిలో పైలట్ ప్రాజెక్టు కింద 927 రైతులకు చెందిన 3,212 ఎకరాలలో ఆయిల్‌పాం సాగు చేపట్టారు. అయితే ప్రస్తుతం దిగుబడి రావడంతో గెలల సేకరణ కేంద్రాలను మండలంలో ఏర్పాటు చేసినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి సురేశ్ తెలిపారు. ప్రస్తుత మార్కెట్ ధరకే రైతుల నుంచి గెలలను సేకరించి గోదాంలో నిల్వ చేసి ప్రతి పదిహేను రోజుల కొకసారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆశ్వరావుపేటలోని పాం ఆయిల్ నూనె తయారీ కర్మాగారానికి తరలిస్తామన్నారు. అమరచింత, పెద్దమందడి, శ్రీరంగాపూర్, వీపనగండ్ల, పెబ్బేరు మండలంలోని 15మంది రైతులకు చెందిన 102 ఎకరాల నుంచి సోమవారం 24 టన్నుల గెలలను సేకరించి గోదాంలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం టన్నుకు మార్కెట్ ధర రూ.13,438లు ఉన్నట్లు తెలిపారు.

తీసుకొన్న పింఛన్ తిరిగివ్వాల్సిందే..!

- భర్త బతికుండగానే వితంతు పింఛన్ పొందిన అయిజకు చెందిన మహిళ
- 2020లో వెలుగులోకి రావడంతో నిలిపివేత
- 60 నెలలకుగానూ తీసుకున్న రూ.70,160 చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ నోటీస్

అయిజ, జూలై 1 : భర్త బతికుండగానే వితంతు పింఛన్ పొందడంతోపాటు భర్త సైతం నేటికీ వృద్ధాప్య పింఛన్ పొందుతున్న సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. వితంతు మహిళ పింఛన్ విషయం ఆర్టీఐ యాక్టుతో ఆలస్యంగా వెలుగులోకి రాగా నిలిపివేశారు. అయితే ఐదేండ్ల పాండు తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వాలని అయిజ మున్సిపల్ అధికారులు నోటీస్ జారీ చేశారు. ఇందుకు సంబంధించిన కమిషనర్ సత్యాబాబు కథనం మేరకు వివరాలు..

అయిజ పట్టణంలోని రంగుపేటకు చెందిన సుంకర ధనలక్ష్మీ (భర్త వేణుగోపాల్) 2015, మేలో వితంతు మహిళ కింద పింఛన్ మంజూరైంది. నాటి 2020, ఏప్రిల్ వరకు పింఛన్ తీసుకుంటూ వచ్చింది. అప్పటి అధికారుల అలసత్వంతోనే భర్త బతికుండగానే పింఛన్ పొందుతూ వచ్చింది. కాగా నాటి సర్కారు ఒక కుటుంబంలో ఇద్దరి పింఛన్లు ఉండొద్దని ఆదేశాలతో డీఆర్‌డీఏ అధికారులు పరిశీలించి ధనలక్ష్మి పేరును పింఛన్ జాబితా నుంచి తొలగించారు. కాగా ఐదేండ్ల పాటు ధనలక్ష్మీ పొందిన పింఛన్ వివరాలు అందించాలని గత నెల 11వ తేదీన కమిషనర్ ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు పూర్తి వివరాలు అందజేశారు. 60 నెలలుగా రూ.70,160 పింఛన్ డబ్బు పొందినట్లు వెల్లడి కావడంతో తీసుకున్న మొత్తం ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని కమిషనర్ నోటీసులు జారీ చేశారు.

అభయారణ్యంలో ప్లాస్టిక్ నిషేధం

- ఐఎఫ్‌ఎస్ సుశాంత్

అచ్చంపేట రూరల్, జూలై 1 : అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టు (ఏటీఆర్) అభయారణ్యంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామని.. పర్యాటకులు, భక్తులు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని ఐఎఫ్‌ఎస్ సుశాంత్ సూచించారు. అచ్చంపేట రేంజ్ పరిధిలోని ఉమామహేశ్వరాలయాన్ని ఆయన సోమవారం సందర్శించి ప్లాస్టిక్ నిషేధంపై తీసుకుంటున్న చర్యలను ఈవో శ్రీనివాసరావు, చైర్మన్ సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏటీఆర్ ప్రాంతాన్ని ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించామన్నారు. పలు రకాల పర్యావరణహిత కార్యక్రమాలను అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నామన్నారు. అనంతరం ఉమామహేశ్వరం చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేసి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌వో సాధిక్, బీట్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమా మహేశ్వరంలో పరిసరాలను పరిశీలిస్తున్న ఐఎఫ్‌ఎస్ సుశాంత్

లీగల్ హేర్ లేకుండా ఇతరుల పేర పట్టా

- డీటీపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు

అచ్చంపేట రూరల్, జూలై 1 : మండలంలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన కోన లక్ష్మయ్యకు 4.075 గుంటల భూమి ఉన్నది. కాగా లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఈక్రమంలో అతడి వారసులకు తెలియకుండా డిప్యూటీ తాసీల్దార్ లీగల్ హేర్ లేకుండా తప్పుడు పత్రాలతో బాలచంద్రయ్య పేరన రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ విషయాన్ని బాలమ్మ సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో కలెక్టర్ సంతోష్‌కు ఫిర్యాదు చేసింది. డిప్యూటీ తాసీల్దార్ అశోక్, తమ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న బాలచంద్రయ్య, అతడికి సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని.. భూమిని కోన లక్ష్మయ్య వారసుల పేర చేయాలని ఫిర్యాదు చేశారు.

ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కోన లక్ష్మయ్య భార్య బాలమ్మ

బీఎస్‌ఎన్‌ఎల్ రూ.249 ప్లాన్

- 45 రోజుల వ్యాలిడిటీ.. రోజూ 2జీబీ
- టెలికం ఇండస్ట్రీలో హాట్ టాపిక్

న్యూఢిల్లీ, జూలై 1: దేశీయ ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్‌ఎన్‌ఎల్) కొత్త కస్టమర్లను ఆకట్టుకోవడానికి ఓ నయా ప్లాన్‌ను పరిచయం చేసింది. దీని రేటు రూ.249 మాత్రమే. కాలవ్యవధి 45 రోజులు. అన్‌లిమిటెడ్ కాల్స్‌తో ఉన్న ఈ ఆకర్షణీయ ప్యాకేజీలో రోజూ 2జీబీ డాటా, 100 ఉచిత ఎస్‌ఎంఎస్‌లను వినియోగదారులు వాడుకోవచ్చు. అయితే ప్రైవేట్ రంగ టెలికం కంపెనీలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా.. ఇటీవలే తమ ప్లాన్ల ధరలను భారీగా పెంచుతున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో బీఎస్‌ఎన్‌ఎల్ ప్లాన్ ఇప్పుడు టెలికం ఇండస్ట్రీలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. అధిక టారీఫ్‌ల నుంచి ఉపశమనాన్ని కోరుకునే మొబైల్ యూజర్లను ఆకట్టుకునేందుకే బీఎస్‌ఎన్‌ఎల్ తక్కువ ధరకే ఎక్కువ ప్రయోజనాలున్న ఈ ప్లాన్‌ను తీసుకొచ్చిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఇతర టెలికం కంపెనీలు ఇదే ధర (రూ.249)కు రోజుకు 1జీబీ డాటానే ఇస్తుండగా, వ్యాలిడిటీ కూడా 28 రోజులే ఉంటుండటం గమనార్హం. దీంతో బీఎస్‌ఎన్‌ఎల్ నూతన ప్లాన్‌లో రోజువారీ డాటా రెట్టింపవడమేగాక, ప్లాన్ గడువు కూడా 17 రోజులు పెరుగుతున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ వినియోగదారులకు ఇది గొప్ప ఊరటగానే చెప్పుకోవచ్చు. ఇదిలావుంటే బుధవారం నుంచి జియో, ఎయిర్‌టెల్.. గురువారం నుంచి వొడాఫోన్ ఐడియా తమ ప్లాన్ల ధరలను దాదాపు 26 శాతం మేర పెంచుతున్నాయి. దీంతో ఒక్కో వినియోగదారునిపై గరిష్ఠంగా రూ.600 భారం పడబోతున్నది.

బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకుంటున్న ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి

ఉన్నత శిఖరాలకు సూచీలు

సెన్సెక్స్ 443, నిఫ్టీ 131 పాయింట్ల వృద్ధి

ముంబై, జూలై 1: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో సూచీలు మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు ముఖ్యంగా ఆసియా, యూరోపియన్ సూచీలు లాభాల్లో ముగియడంతో దేశీయ మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఒక దశలో 500 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 443.46 పాయింట్లు అందుకొని ఆల్-టైం హైకి 79,476.19 పాయింట్లకు చేరుకున్నది. 30 షేర్ల ఇండెక్స్‌లో 20 షేర్లు లాభపడగా, 10 షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. మరో సూచీ నిఫ్టీ 24 వేల పాయింట్ల పైన ముగిసింది. 131.35 పాయింట్లు అందుకొని 24,141.95 వద్ద స్థిరపడింది. దీంతో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.4,43,05,344.036 కోట్లకు చేరుకున్నది.

- టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, టీసీఎస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటర్స్, ఐసీఐసీఐ బ్యాంక్‌లషేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఎన్టీపీసీ, ఎస్బీఐ, లార్సెన్ అండ్ టుబ్రో, సన్‌ఫార్మా, ఇండస్‌ఇండ్, యాక్సిస్ బ్యాంక్‌లు నష్టాల్లోకి జారుకున్నాయి.
- ఐటీ అత్యధికంగా 1.84 శాతం లాభపడగా.. టెక్ 1.46 శాతం, కమొడిటీస్ 1.21 శాతం, టెలికమ్యూనికేషన్ 1.03 శాతం, మెటల్ రంగ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

అంతర్జాతీయ పేమెంట్స్ కోసం..

వివిధ ఆసియా దేశాలతో కలిసి వెళ్తున్న ఆర్బీఐ

ముంబై, జూలై 1: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. మలేషియా, సింగపూర్ సహా నాలుగు ఆసియా దేశాలు కలిసి వేగవంతమైన రిటైల్ పేమెంట్స్ కోసం ఓ వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. 2026లో ఇది అందుబాటులోకి రావచ్చన్న అంచనాలున్నాయి. దేశీయ ఫాస్ట్ పేమెంట్స్ సిస్టమ్స్ (ఎఫ్‌పీఎస్) ఇంటర్‌లింకింగ్ ద్వారా ఓ ఇన్‌స్టంట్ క్రాస్-బార్డర్ రిటైల్ పేమెంట్స్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధికి బహుళజాతి ఆలోచన ప్రాజెక్ట్ అయిన నెక్సస్‌లో భాగస్వామ్యమైనట్టు ఆర్బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ (బీఐఎస్) ఇన్నోవేషన్ హబ్ కాన్సెప్టే ఈ నెక్సస్. దీని ద్వారా తొలుత భారత్, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్ దేశాల ఎఫ్‌పీఎస్‌ల అనుసంధానం జరుగుతుందని ఆర్బీఐ వివరించింది. ఈ మేరకు జరిగిన ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో ఆర్బీఐతోపాటు ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు, బీఐఎస్ సంతకాలు చేశాయి. మున్ముందు మరిన్ని దేశాలు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతాయని ఆర్బీఐ చెప్పింది.

పూర్తిగా రాని రూ.2వేల నోట్లు

రూ.2వేల నోట్లు పూర్తిగా తిరిగి బ్యాంకుల్లోకి రాలేదని ఆర్బీఐ సోమవారం తెలిపింది. ఇప్పటిదాకా 97.87 శాతం వచ్చినట్టు వివరించింది. ఇంకా రూ.7,581 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని చెప్పింది. గత ఏడాది మే 19న రూ.2వేల నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. నాడు వీటి విలువ రూ.3.56 లక్షల కోట్లుగా ఉన్నది. అయితే జూన్ 28 నాటికి ఇది రూ.7,581 కోట్లకు పడిపోయినట్టు ఆర్బీఐ తెలిపింది. దీంతో 97.87 శాతం రూ.2వేల నోట్లు తిరిగి బ్యాంకుల్లోకి వచ్చేశాయని పేర్కొన్నది. ఈ పెద్ద నోట్ల మార్పిడికి ప్రస్తుతం హైదరాబాద్‌సహా దేశంలోని 19 ఆర్బీఐ కార్యాలయాల్లో వీలు కల్పించారు. 2016 నవంబర్‌లో రూ.1000, రూ.500 నోట్ల రద్దు నేపథ్యంలో ఈ రూ.2000 నోట్లు పరిచయమైన సంగతి విదితమే.



కొత్త ఈడీల నియామకం

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా ఆర్నాబ్ కుమార్ చౌధరి, చారులతా ఎస్ కార్‌లను నియమించినట్టు ఆర్బీఐ వెల్లడించింది. ఈ ఇరువురూ మూడేసి శాఖలను పర్యవేక్షిస్తారని కూడా ప్రకటించింది. కార్ నియామకం సోమవారం నుంచే అమల్లోకి రాగా, చౌధరి నియామకం మాత్రం జూన్ 3 నుంచే వర్తిస్తుంది.

వాణిజ్య

బెంజ్‌తో బిట్స్ పిలానీ

ముంబై, జూలై 1: బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్-పిలానీ(బిట్స్ పిలానీ).. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ పరిశోధనల కోసం ఐదేండ్లపాటు మాస్టర్ రిసెర్చ్ అగ్రిమెంట్(ఎంఆర్‌ఏ) సేవలు అందించడానికి మెర్సిడెస్-బెంజ్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా(ఎంబీఆర్‌డీఐ)తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. డాటా, కృత్రిమ మేధస్సు, ఎలక్ట్రిక్ మొబిలిటీలపై ప్రత్యేక దృష్టి సారించడానికి ఈ భాగస్వామ్యం కలిసొస్తుందని బిట్స్ పిలానీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రామ్ గోపాల్ రావు తెలిపారు.

జీఎస్టీ.. 1.74 లక్షల కోట్లు!

న్యూఢిల్లీ, జూలై 1: గత నెలకుగాను రూ.1.74 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.1.61 లక్షల కోట్ల కంటే ఇది 8 శాతం అధికం. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలలు వరకు రూ.5.57 లక్షల కోట్ల మేర పన్నులు వసూలయ్యాయని తెలిపారు.

గెలాక్సీ ఏఐలో హిందీ

న్యూఢిల్లీ, జూలై 1: సామ్‌సంగ్.. తమ పాపులర్ గెలాక్సీ స్మార్ట్‌ఫోన్ సిరీస్‌లో తెచ్చిన ఏఐ లాంగ్వేజ్ మాడల్స్‌కు హిందీని జత చేసింది. బెంగళూరులోని సామ్‌సంగ్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్.. గెలాక్సీ ఏఐ కోసం ఈ హిందీ ఏఐ మాడల్‌ను అభివృద్ధిపర్చింది. ఈ మేరకు సోమవారం సంస్థ తెలియజేసింది.

యంగ్‌వన్‌లో దుస్తుల తయారీ!

కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్ వెల్లడి

గీసుగొండ, జూలై 1: వరంగల్ జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్లో త్వరలో దుస్తుల తయారీని ప్రారంభించనున్నట్లు యంగ్‌వన్ కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్ తెలిపారు. ప్లాంట్ కోసం కేసీఆర్ ప్రభుత్వం 297 ఎకరాల భూమి కేటాయించినట్లు, పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి గత ప్రభుత్వమే అన్ని రకాల అనుమతులు మంజూరు చేసిందన్నారు. వెయ్యి కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, తద్వారా 11 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఈ యూనిట్‌లో స్పోర్ట్స్, డ్రెస్ మెటీరియల్స్, జర్కిన్స్, సూట్స్ తదితర దుస్తులు తయారుకానున్నాయి. అలాగే శిక్షణ కేంద్రంలో కుట్టు శిక్షణ తీసుకుంటున్న మహిళల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎన్‌సీసీకి 335 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, జూలై 1: రాష్ట్రానికి చెందిన ప్రముఖ సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్ ఆర్డర్లు ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నది. గడిచిన నెలలో రూ.335 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఈ ఆర్డర్లు బిల్డింగ్ డివిజన్ నుంచి వచ్చాయని తెలిపింది. వీటిలో అంతర్జాతీయ ఆర్డర్లు లేవని పేర్కొంది.

పతంజలి ఫుడ్స్ చేతికి పీఏఎల్ పర్సనల్ కేర్

డీల్ విలువ రూ.1,100 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 1: యోగా గురువు బాబా రాందేవ్ నేతృత్వంలోని పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ (పీఏఎల్)కు చెందిన హోం, పర్సనల్ కేర్ వ్యాపారాన్ని తమ సొంతం చేసుకున్నట్టు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సోమవారం ప్రకటించింది. ఈ అంతర్గత లావాదేవీ విలువ రూ.1,100 కోట్లుగా పేర్కొన్నది. ఐదు విడుతల్లో ఈ చెల్లింపులు జరుగుతాయి. కంపెనీ వాటాదారులు, రుణదాతల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ ఉంటుంది. అలాగే దీనికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం రావాల్సి ఉన్నది. ప్రధాన ఎఫ్‌ఎంసీజీ కంపెనీగా ఎదగడానికే ఈ డీల్‌కు దిగినట్టు దేశీయ వంటనూనెల తయారీ దిగ్గజ సంస్థల్లో ఒకటిగా ఉన్న పతంజలి ఫుడ్స్ సంస్థ తెలిపింది. కాగా, ప్రస్తుతం పతంజలి ఫుడ్స్ ప్రమోటర్లలో పీఏఎల్ కూడా ఒకటిగా ఉన్నది. ఇక ఈ డీల్‌తో హెయిర్ కేర్, స్కిన్ కేర్, డెంటల్ కేర్, హోం కేర్ వ్యాపార విభాగాలు పతంజలి ఫుడ్స్ కిందకు వస్తాయి. ఈ డీల్ ఈ ఏడాది సెప్టెంబర్ ఆఖరుకల్లా పూర్తవగలదన్న ఆశాభావాన్ని పతంజలి ఫుడ్స్ సీఈవో సంజీవ్ ఆస్తానా వ్యక్తం చేశారు.

మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

గ్రామీణ ప్రాంతాలకు విస్తరించండి!

మైక్రోసాఫ్ట్‌కు మంత్రి శ్రీధర్ బాబు సూచన

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): మైక్రోసాఫ్ట్ తన కార్యకలాపాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. డాటా సెంటర్ల విస్తరణ పనులు వచ్చే ఏడాదినాటికి పూర్తి చేయాలని తనను కలిసిన మైక్రోసాఫ్ట్ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ భారీ విస్తరణ ప్రణాళిక పూర్తైతే అత్యాధునిక డాటా సెక్యూరిటీ, క్లౌడ్ సొల్యూషన్ రంగంలో హైదరాబాద్ అగ్రస్థానానికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని మేకగూడ వద్ద 22 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయతలపెట్టిన డాటా సెంటర్ భూ సేకరణకు సంబంధించి పలు సమస్యలు తలెత్తాయని కంపెనీ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కే శశాంకను ఆదేశించారు.

కార్ల అమ్మకాలు అంతంతే..

న్యూఢిల్లీ, జూలై 1: దేశీయ మార్కెట్‌లో గత నెల ప్యాసింజర్ వాహన విక్రయాలు స్వల్పంగానే పెరిగాయి. నిరుడు జూన్‌తో చూస్తే.. ఈ ఏడాది జూన్‌లో మారుతీ సుజుకీ అమ్మకాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఏమీ వృద్ధి చెందలేదు. హ్యుందాయ్ సేల్స్ అక్కడక్కడే ఉండగా.. టాటా మోటర్స్, హోండా, ఎంజీ మోటర్ సేల్స్ పడిపోయాయి. అయితే మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా, కియా కార్ల విక్రయాలు పెరిగాయి. టూవీలర్ సెగ్మెంట్‌లోనూ పరిస్థితి ఇలాగే ఉన్నది. దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, ఇంకా ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయిల్లోనే నమోదవుతుండటం మార్కెట్‌ను దెబ్బతీసిందంటున్నారు. ఇక ఓవరాల్‌గా చూస్తే ఈసారి జూన్‌లో మొత్తం ప్యాసింజర్ వెహికిల్ సేల్స్ 3.67 శాతం పెరిగి 3,40,784 యూనిట్లుగా ఉన్నాయి. నిరుడు ఇదే నెల 3,28,710 యూనిట్లుగా ఉన్నాయి.

జూన్‌లో దేశీయ వాహన విక్రయాలు (యూనిట్లలో)

సంస్థ	2023	2024
మారుతీ సుజుకీ	1,33,027	1,37,160
హ్యుందాయ్	50,001	50,103
టాటా మోటర్స్	47,359	43,624
మహీంద్రా&మహీంద్రా	32,588	40,022
టయోటా	19,608	27,474
కియా ఇండియా	19,391	21,300
హోండా	5,080	4,804
ఎంజీ మోటర్	5,125	4,644
బజాజ్ ఆటో	1,99,983	2,16,451
టీవీఎస్ మోటర్	2,35,833	2,55,734
సుజుకీ మోటర్‌సైకిల్	---	71,086